# ఐదు శాతం పన్ను రాయితీ

- గృహ, స్థల యజమానుల కోసం ప్రకటన
- 4న ప్రకటించిన మున్సిపల్ ఉన్నతాధికారులు
- తెనాలిలో 37 వేల మందికి రూ.97.77 లక్షల లబ్ధి
- ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్న పన్నుల చెల్లింపులు



పన్నులు చెల్లింపు కేంద్రంలో బారులు తీరిన ప్రజలు

**తెనాలిఅర్బన్:** పట్టణ పరిధిలోని ఇంటి, ఖాళీ స్థల యజమానులకు మున్సిపల్ ఉన్నతాధికారులు తీపి కబురు చెప్పారు. తమ ఇంటి, ఖాళీ స్థల పన్నులను ఒకేసారి ఈనెల 30వ తేదీలోపు చెల్లిస్తే పన్నులో అయిదు శాతం రాయితీ ఇవ్వనున్నట్లు పురపాలకశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ ప్రకటిస్తూ ఈ నెల 4న ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో గృహ, ఖాళీ స్థల యజమానులు పన్నుల చెల్లింపులను ఇప్పుడిప్పుడే వేగవంతం చేస్తున్నారు.

తెనాలి పురపాలక సంఘ పరిధిలో 37,072 నివాస, ఖాళీ స్థలాలు ఉన్నాయి. వీటిలో సుమారు రెండు లక్షల జనాభా నివశిస్తున్నారు. పట్టణ పరిధిలోని నివాసగృహాలు, ఖాళీ స్థలాలకు ప్రతి ఏడాది రెండు సార్లు పురపాలక సంఘం పన్ను విధించి, వసూలు చేస్తుంటుంది. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ ఒకసారి, అక్టోబర్ నుంచి మార్చి వరకు మరోసారి పన్నులను విధించి వసూలు చేస్తుంటారు. పన్నుల రూపంలో ప్రతి ఏడాది సుమారు రూ.19.55 కోట్ల ఆదాయం మున్సిపాలిటీకి సమకూరుతుంది. ఇవి కాకుండా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల అద్దెల కింద సుమారు రూ.2 కోట్ల ఆదాయం సమకూరుతూ ఉంటుంది. మొత్తం మీద తెనాలి పురపాలక సంఘానికి వీటి ద్వారా ఏడాదికి రూ.21.55 కోట్ల ఆదాయం సమకూరుతుందని చెప్పవచ్చు.

**గత ఏడాది ముందు వరుసలో..**

ఖాళీ స్థల, ఇంటి, కుళాయి పన్నుల వసూలులో గత ఆర్థిక సంవత్సరంలో తెనాలి పురపాలక సంఘం ముందు వరుసలో ఉంది. గత ఏడాది పన్నుల రూపంలో మొత్తం రూ.21.92 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా 2025 మార్చి నెల 31వ తేది గడువు ముగిసే నాటికి రూ.17.80 కోట్లు వసూలు చేశారు. 2024 మార్చితో పోల్చుకుంటే ఏడాది సుమారు రూ.80 లక్షలు అదనంగా అధికారులు వసూలు చేయగలిగారు.

## 37 వేల మందికి లబ్ధికి రూ.97 లక్షల లబ్ధి

మున్సిపల్ ఉన్నతాధికారులు ఇటీవల ప్రకటించిన పన్ను రాయితీ వల్ల తెనాలి పట్టణ పరిధిలోని 37,072 మంది లబ్ధిదారులకు మేలు చేకూరనుంది. వీరు ఏడాదికి రెండుసార్లు చొప్పున రూ.19,55,53,442 పన్నుల రూపంలో చెల్లించాల్సి ఉంది. పన్ను రాయితీ వల్ల వీరు చెల్లించాల్సిన పన్నులో రూ.97,77,672 మినహాయింపు పొందే అవకాశం లభించనుంది. అది కూడా ఈ నెల 30వ తేదీలోపు ఒకేసారి పన్నును చెల్లిస్తేనే రాయితీ లభించే అవకాశం ఉంది. దీంతో పట్టణ వాసులు మున్సిపల్ కార్యాలయంలోని పన్నుల చెల్లింపు కౌంటర్‌కు వచ్చి ఇప్పుడిప్పుడే పన్నులు చెల్లిస్తున్నారు. దీంతో పన్నుల చెల్లింపుల కేంద్రం ప్రజలతో కిటకిటలాడుతుంది.

### రాయితీ ఉపయోగించుకోవాలి



పట్టణ పరిధిలో పన్నుల చెల్లింపుదారులకు ప్రభుత్వం రాయితీ ప్రకటించింది. ఈ నెల 30వ తేదీలోపు ఏడాది పన్నును ఒకే సారి చెల్లించండి. అలా చేయటం వల్ల పన్నులో అయిదు శాతం రాయితీ లభిస్తుంది. మున్సిపల్ కార్యాలయంలోని పన్నుల చెల్లింపు కేంద్రం, వార్డు సచివాలయాల్లో పన్నులు చెల్లించవచ్చు. ఈ అవకాశాన్ని ఇంటి, ఖాళీ స్థల యజమానులు ఉపయోగించుకోవాలి.

ఎన్వీ రాంప్రసాద్
రెవెన్యూ అధికారి, తెనాలి

# కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్



మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న కార్మికులు

**తెనాలిఅర్బన్:** మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు గురువారం కొద్దిసేపు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం వస్తే కార్మికుల జీవితాలు మరతాయని ఆశించినట్లు తెలిపారు. కానీ కార్మికులకు ఉన్న హక్కులను కూడా ప్రభుత్వం కాలరాస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు కార్మికులకు జీతాలు ఇస్తున్న ఆప్కాస్ సంస్థను రద్దు చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. పాత కాంట్రాక్ట్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు చేసే ప్రయత్నాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు ఇవ్వవలసిన యూనీఫాం, చెప్పులు, కొబ్బరినూనె, సబ్బులు, గ్లౌజ్‌లు, యాప్రాన్‌లు వెంటనే ఇవ్వాలని కోరారు. అనంతరం కమిషనర్ శేషన్నను తన కార్యాలయంలో కలసి సమస్యలు తెలియజేశారు. తన పరిధిలో ఉన్న వాటిని త్వరగా పరిష్కరించేందుకు కమిషనర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడు షేక్ హుస్సేన్‌వలీ, నాయకులు ఎం.పద్మ, వి.సుధాకర్, పి.జయలక్ష్మి, పద్మావతి, ఎం.శ్రీను, ఎం.నాగరాజు, ఎస్.గోపి, కనకలక్ష్మి, సి.హెచ్.అంజయ్య, వి.లక్ష్మీనారాయణ, డి.పద్మ, రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



ప్రమాదాలు సంభవించినప్పుడు కాపాడే విధానాన్ని వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

**తెనాలిరూరల్:** అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఆందోళన చెందకుండా సమన్వయంతో వ్యవహరించాలని తెనాలి అగ్నిమాపక అధికారులు, సిబ్బంది విద్యార్థులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన గురువారం స్థానిక కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూలులో విద్యార్థులకు ప్రమాదాల నివారణ, ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించారు. లీడింగ్ ఫైర్ మ్యాన్ జి. సూరిబాబు మాట్లాడుతూ వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాద బాధితులకు స్వచ్ఛమైన గాలి అందేలా చూడాలని, కాలిన గాయాలైతే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు సురక్షితంగా బయటపడడం, అలాగే మంటలను అదుపు చేయడాన్ని ప్రదర్శించారు. విషవాయువులలో చిక్కుకున్న వారికి రక్షించేందుకు వినియోగించే బీఏ సెట్ పరికరం పనితీరును వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### కాల్వలో నీరు పారుదలయ్యేలా చూడండి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

**తెనాలి అర్బన్:** కాల్వల్లో మురుగు పారుదల జరిగే విధంగా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు కాలనీ నుంచి వైకుంఠపురం రైల్వేట్రాక్ వరకు జరుగుతున్న కాల్వ పూడికతీత పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన కాల్వల్లో తూటికాడ ఎక్కువగా ఉందన్నారు. దానితో పాటు వ్యర్థాలను కూడా తొలగిస్తున్నట్లు చెప్పారు. ఆమె వెంట ఏఈ సునీల్‌కుమార్, టీపీవో సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, పలువురు సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

### కాంగ్రెస్ పట్టణ ఉపాధ్యక్షుడిగా శ్రీను

**తెనాలిటౌన్:** కాంగ్రెస్‌పార్టీ పట్టణ ఉపాధ్యక్షునిగా గుర్రపు ద్వారక శ్రీనివాసరావు నియమితులయ్యారు. గురువారం స్థానిక మారీసుపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చందు సాంబశివుడు శ్రీనివాసరావుకు నియామక పత్రం అందజేశారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ద్వారక శ్రీనివాసరావు తెలియజేశారు. కార్యక్రమంలో పి.నాగసూర్యశేఖర రావు, పెనుగొండ శివకుమార్, బుల్లయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

### నేడు శిలువధారి కార్యక్రమం ఏర్పాటు

**తెనాలిటౌన్:** గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు ఐతానగర్ క్రీస్తు కృపాలయం వద్ద నుంచి అంబేడ్కర్ చౌక్ వరకు శిలువధారి కార్యక్రమం నిర్వహించనున్నట్లు రెవరెండ్ డాక్టర్ వేముల సర్వోన్నతరావు తెలిపారు. గురువారం ఐతానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఐతానగర్ క్రీస్తు కృపాలయం సెంటీనరీ లూథరన్ చర్చి, హైయర్‌పేట ప్రార్థన మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని చెప్పారు. క్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటలను దైవసేవకులు వివరిస్తారని తెలిపారు. శిలువధారి కార్యక్రమంలో అధిక సంఖ్యలో క్రీస్తు విశ్వాసులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బొనిగల ప్రదీస్, జి.ప్రకాష్‌బాబు, ఎం.సునీల్‌బాబు పాల్గొన్నారు.

### ఇరువర్గాలపై కేసులు

**తెనాలిరూరల్:** చిన్న పిల్లలు ఆడుకునే విషయంలో జరిగిన గొడవలో పెద్దలు కలుగజేసుకుని రెండు వర్గాలుగా విడిపోయి పరస్పర దాడికి పాల్పడిన ఘటనపై రూరల్ పోలీసులు నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేశారు. తెనాలి మండలం పెదరావూరులోని చినపల్లెలో ఈ నెల 12వ తేదీ రాత్రి చిన్న పిల్లలు ఆడుకునే విషయంలో గొడవ జరిగింది. ఇందులో పెద్దలు కలుగేసుకుని, గరిక వెంకటేశ్వరరావు ఒక వర్గంగా, కనపర్తి శిరీష మరో వర్గంగా విడిపోయి పరస్పర దాడులకు పాల్పడ్డారు. ఘటనలో 10 మందిపై గురువారం నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసినట్టు రూరల్ ఎస్‌ఐ కె. ఆనంద్ తెలిపారు.

### వాయిదాలకు హాజరుకాని నిందితుడి అరెస్ట్

**తెనాలిరూరల్:** కోర్టు వాయిదాలకు హాజరుకాని నిందితుడిపై అరెస్ట్ వారెంట్ జారీ కావడంతో పోలీసులు అతన్ని అరెస్ట్ చేశారు. తెనాలి రైల్వే స్టేషన్ సమీపంలో నివసించే షేక్ రబ్బానికి అతని అన్న అల్లుడైన నాయబ్ రసూల్‌తో కుటుంబ కలహాలు, ఆస్తి పంపకాల విషయంలో విభేదాలు ఉన్నాయి. ఈ క్రమంలో రబ్బానీని 2022 మార్చిలో నాయబ్‌రసూల్, అతని మిత్రుడైన విజయవాడ కండ్రిగకు చెందిన షేక్ జాన్‌బాబుతో కలసి హత్య చేశాడు. ఈ కేసులో వాయిదాలకు రాకుండా జాన్‌బాబు రెండేళ్ల నుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ క్రమంలో కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేయడంతో జాన్‌బాబును రూరల్ ఎస్‌ఐ కె. ఆనంద్ గురువారం అరెస్ట్ చేశారు.

### ఒలంపియాడ్ పరీక్షల్లో చైతన్య విద్యార్థుల ప్రతిభ

**తెనాలిఅర్బన్:** ఇటీవల జరిగిన ఇండియన్ నేషనల్ టాలెంట్ సర్చ్ ఒలంపియాడ్ పరీక్షల్లో చెంచుపేటలోని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు మంచి ప్రతిభ కనబరచారని ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య తెలిపారు. గ్రాండ్ ప్రైజ్ కింద నలుగురికి ల్యాప్‌టాప్‌లు, మొదటి బహుమతి కింద 14 మంది ట్యాబ్‌లు, రెండో వ స్థానం 15 మంది, మూడవ స్థానం 16 మంది, నాల్గవ స్థానం10 మంది, ఐదవ స్థానానికి 29 మంది ఎంపికైనట్లు చెప్పారు. వీరందరికీ గురువారం పాఠశాల ఆవరణలో సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అప్పాజీ, కో-ఆర్డినేటర్ గోపీచంద్, ప్రిన్సిపల్స్ కె.మాధురి, రాధా, లక్ష్మీపతి, పద్మవాణి, బాషా, హరిబాబు, అరుంధతి పాల్గొన్నారు.



# వ్యర్థాల తొలగింపును వేగవంతం చేయండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



కంపోస్టు యార్డును పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

**తెనాలిఅర్బన్:** కంపోస్టు యార్డులోని వ్యర్థాల తొలగింపును వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. కంపోస్టు యార్డును గురువారం ఆయన పరిశీలించి తరలింపు ప్రక్రియపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో తరలింపులో కొంత జాప్యం జరుగుతుందన్నారు. ఎట్టి పరిస్థితిల్లో మే చివరి నాటికి 60 శాతం తరలింపును పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట ఏఈ సూరిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

### రేపు తెనాలిలో ఈ-వ్యర్థాలు నిర్వహణ

**తెనాలిటౌన్:** ఈ నెల 19వ తేదీన స్థానిక శివాజీచౌక్ సెంటర్‌లో ఈ-వ్యర్థాలు నిర్వహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వర్ణంధ్ర-స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 3వ శనివారం నిర్వహించే ఇ-వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పట్టణంలోని దుకాణదారులకు పిలుపునిచ్చారు. పాడైపోయిన కంప్యూటర్ పరికరాలు, మొబైల్స్, టేబుల్స్, బల్బులు, బ్యాటరీలు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకువచ్చి ఇవ్వాలని కోరారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు క్యాంపు ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు.

### ప్లాట్‌ఫాంపై మహిళ మృతి



**తెనాలిరూరల్:** తెనాలి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై మహిళ మృతి చెందింది. పట్టణ చెంచుపేటకు చెందిన రేవూరి నాగ రంజిత (60) జేఎంజే కళాశాలలో పని చేస్తోంది. గురువారం తెనాలి స్టేషనుకు వచ్చిన ఆమె ఒకటో నంబరు ప్లాట్‌ఫాంపై కుప్పకూలింది. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించగా ఆమె ఆధార్ కార్డు, కొన్ని కోర్టు పత్రాలు లభించాయి. మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గతంలో చేసిన అప్పులకు కోర్టులో శాలరీ అటాచ్‌మెంట్ పిటిషన్ వేశారని, ఈ క్రమంలో ఆమె గుండెపోటుతో మృతిచెందిందా లేక మరోదైనా కారణముందా అన్నది పోస్ట్‌మార్టం అనంతరం తెలుస్తుందని జీఆర్పీ ఎస్‌ఐ వెంకటాద్రి తెలిపారు.

### లింగాకర్షణ బుట్టల వినియోగంపై అవగాహన



**తెనాలిటౌన్:** తెల్ల దోమల నివారణ, తామరపురుగు ఆకర్షించే లింగాకర్షణ బుట్టలు, జిగురు అట్టల వినియోగంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు సూచించారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో గురువారం ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఆధ్వర్యంలో గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పాల్గొని తెల్లజొన్న, తామరపూవు ఆకర్షించే నీలం, జిగురు అట్టల వినియోగంపై వివరించారు.

# క్షయవ్యాధి నివారణకు చర్యలు



సీవై టీబీ పరీక్షలు చేస్తున్న టెక్నీషియన్

**తెనాలిఅర్బన్:** క్షయవ్యాధి నివారణకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పల్లికొండ రవికుమార్ పేర్కొన్నారు. గంగానమ్మపేట, సాలీపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లలో గురువారం ఊపిరితిత్తుల టీబీకి మందులు వాడుతున్న వ్యాధిగ్రస్తులతో నివాసిస్తున్న కుటుంబ సభ్యులకు సీవై టీబీ టెస్ట్‌లను ఎయిమ్స్ నుంచి వచ్చిన జూనియర్ రెసిడెంట్ వైద్యులు డాక్టర్ ఉత్కర్ష తివారి చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ 2025 నాటి క్షయ వ్యాధి లేని దేశంగా తీర్చిదిద్దేందుకు కేంద్రం కృషి చేస్తుందన్నారు. టీబీ రాకుండా ప్రివెన్సన్ థెరఫీ ఇవ్వవచ్చని తెలిపారు. టీబీ సోకిన వారి కుటుంబ సభ్యులకు వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారులు డాక్టర్ మౌనిక, కిషోర్, డాక్టర్ సిహెచ్.పుష్పలత, హెల్త్ విజిటర్స్ దిలీప్‌కుమార్, భార్గవి, స్టాఫ్ నర్సులు, ల్యాబ్‌టెక్నీషియన్లు పాల్గొన్నారు.

# 'తానా' మాజీ అధ్యక్షుడు గంగాధర్‌కు సతీవియోగం

- అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి
- జులైలో జరగనున్న 24వ తానా మహాసభలకు చైర్మన్‌గా గంగాధర్

**తెనాలి:** ప్రవాస భారతీయుడు, ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) మాజీ అధ్యక్షుడు నాదెళ్ల గంగాధర్‌కు సతీ వియోగం కలిగింది. ఆయన భార్య దుర్గ (65) హైదరాబాద్‌లోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ప్రస్తుతం బాపట్ల జిల్లా పరిధిలో ఉన్న పెదపులివర్రు దగ్గర్లోని గుత్తావారిపాలెం గంగాధర్ స్వస్థలం. ఆయన భార్య దుర్గ సమీపంలోని జిల్లేపల్లికి చెందినవారు. వివాహం తర్వాత గంగాధర్ అమెరికాలోని డెట్రాయిట్‌లో స్థిరపడ్డారు. వారికి ఇద్దరు కుమార్తెలు. ఇద్దరూ వైద్యవృత్తిలో ఉన్నారు. గంగాధర్ గతంలో 'తానా' అధ్యక్షుడిగా చేశారు. రానున్న జులైలో డెట్రాయిట్‌లో జరగనున్న 24వ 'తానా' మహాసభలకు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన భార్య దుర్గ కొంతకాలంగా అనారోగ్యంతో ఉండటంతో హైదరాబాద్‌లో వైద్యచికిత్స అందిస్తున్నారు. అయినా ఫలితం లేకుండా పోయింది. ఆమె అంత్యక్రియలను శుక్రవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో జరుగుతాయని కుటుంబసభ్యులు తెలియజేశారు. దుర్గ మతి పట్ల తానా కార్యవర్గ సభ్యులు, ప్రతినిధులు, పలు తెలుగు సంఘాల ప్రతినిధులు, ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఆ కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పక్షోత్సవాలు



తేలప్రోలులో పిల్లల ఎత్తు, బరువు చూస్తున్న డాక్టర్ సునీత



మఠంబజారులో పౌష్టికాహారకంపై అవగాహన

**తెనాలి:** పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్, తెనాలి ప్రాజెక్టు సీడీపీఓ డాక్టర్ ఎం.సునీత గురువారం రూరల్ మండల గ్రామం తేలప్రోలును సందర్శించారు. ఈనెల 8వ తేదీనుంచి ఆరంభమైన పౌష్టికాహార పక్షోత్సవాలు ఈనెల 22 వరకు జరగనున్నాయి. ఇందులో భాగంగా తేలప్రోలులోని నాలుగు అంగన్‌వాడి కేంద్రాలను డాక్టర్ సునీత సందర్శించారు. పోషకాహార లోపంతో ఉన్న పిల్లలకు ఎత్తు, బరువును నమోదు చేవారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే ఆహారంతోపాటు ఇంటిదగ్గర తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహారాన్ని పిల్లలకు ఇవ్వాల్సిన ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు వివరించారు. పోషకాహార లోపంతో వున్న పిల్లలు సాధారణ స్థాయికి వచ్చేవరకు అంగన్‌వాడీ కార్యకర్త వారి వారి గృహాలను సందర్శిస్తూ, తగిన విధంగా ఫాలోఅప్ చేయాల్సిన బాధ్యతను వివరించారు. అవసరమైతే వైద్యపరీక్షలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ వై.యానాదమ్మ, అంగన్‌వాడి కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**పట్టణ అంగన్‌వాడీ కేంద్రాల్లో...**

పౌష్టికాహార పక్షోత్సవాలను గురువారం స్థానిక 22వ వార్డు మఠంబజారులోని 1,2 అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వై.నాగమణి, ఏఎన్‌ఎం షేక్ బాజీ, మహిళా పోలీస్ ఎస్.సౌజన్య పాల్గొన్నారు. వెయ్యిరోజులపాటు పిల్లల సంరక్షణ గురించి గర్భవతులు, బాలింతలు, ఆర్నెల్ల నుంచి రెండేళ్ల పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. గర్భవతులు తీసుకోవాల్సిన పోషకాహారం, పాటించాల్సిన జాగ్రత్తలు, రక్తహీనత, ప్రసవ సంసిద్ధతను తెలియజేశారు. ఆరునెలల వయసులో చేసే అన్నప్రాసన నుంచి రెండేళ్ల వరకు పిల్లలకు ఇవ్వాల్సిన ఆహారాన్ని వివరించారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, పాల్గొన్నారు.

# తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టండి

- ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు
- చేతిపంపులు, నీటి కుళాయి కనెక్షన్‌లు ఏర్పాటు



సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న ఈవోపీఆర్డీ ప్రసాద్

**తెనాలిటౌన్:** వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా సమగ్ర చర్యలు చేపట్టాలని అధికార యంత్రాగాన్ని ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సాధారణ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీపీ చెన్నకేశవులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశానికి 14 మంది ఎంపీటీసీలు హాజరుకాగా, ఏడుగురు గైర్హాజరయ్యారు. వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యలు ఉన్న గ్రామాలను గుర్తించి చేతిపంపులు, నీటి కుళాయి కనెక్షన్‌లు సత్వరం ఇవ్వాలని సూచించారు. అవసరమైన బోర్ల బోర్ల నిర్మాణం చేపట్టాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను ఆశాఖ సిబ్బంది తెలియజేశారు. ఎక్కడ అవినీతి అవకాశం లేకుండా ప్రతిష్ట చర్యలు చేపట్టాలని ఎంపీపీ సూచించారు.

2024-25 సంవత్సరానికి సంబంధించి మండల పరిషత్ సంవత్సరిక లెక్కలను ఆమోదించారు. 31 మార్చి 2025 నాటికి ఇంకను ప్రారంభించని పనులను రద్దు చేసి వాటి స్థానంలో క్రొత్త పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గ్రామాల్లో విద్యుత్‌లో ఓల్టేజ్ సమస్యలను సభ్యులు తెలియజేశారు. కుక్కల బెడద అధికంగా ఉందని, నివారించాలని కోరారు. గుడివాడ గ్రామంలో చేతిపంపుల అవసరత అధికంగా ఉందని, తక్షణం మంజూరు చేయాలని మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు కోరారు. కొలకలూరు గ్రామ పంచాయతీ పరిధిలో అనేక రకాలుగా అవినీతి జరుగుతుందని ఎంపీటీసీ కాలిశెట్టి ఫణీకుమార్ ఆరోపించారు. సమగ్రమైన బిల్లులు లేకుండా శానిటేషన్ సిబ్బంది ఖాతాల్లో పెద్ద మొత్తంలో నగదు జమ చేస్తున్నారని విమర్శించారు.

కరెంటు బిల్లు సకాలంలో చెల్లించడంలేదన్నారు. గ్రామంలో శానిటేషన్ సమస్య అధికంగా ఉందని, దీనికి తోడు సిబ్బంది కొరత వేంటాడుతుందని తెలిపారు. పలు గ్రామాల్లో బస్సు సర్వీసులు పునరుద్ధరించాలని సభ్యులు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఉపాధ్యక్షురాలు కోడూరి స్వప్న, ఎంపీడీవో అత్తోట దీప్తి, కార్యాలయ సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ వైవిడి ప్రసాద్, మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సౌజన్య, ఎంఈవోలు జయంతిబాబు, లక్ష్మీనారాయణ, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఆపద్బాంధవులు!



పట్టణంలో నిండు గర్భిణి ప్రసవానికి సంబంధించి తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో సకాలంలో వైద్య సేవలు అందని విషయం తెలుసుకున్న తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ మానవతా దృక్పథంతో స్పందించారు. ఈనెల 2న పట్టణానికి చెందిన 29 ఏళ్ళ మహిళ బొక్క సుమిత్రాదేవికి రెండవ కాన్పు విషయంలో సమస్య ఎదురైంది. కాన్పు కష్టమవుతుందని, తమవల్ల కాదని తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స అందించేందుకు నిరాకరించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ గోపాలకృష్ణ, సామాజిక సేవా భావంతో పనిచేస్తున్న పట్టణానికి చెందిన శారద సర్వీస్ సొసైటీ నిర్వాహకులు డాక్టర్ డి.శారదను సంప్రదించారు. దీంతో సదరు గర్భిణిని స్థానిక హాస్పిటల్‌లో చేర్పించటంతో పాటు డాక్టర్ శారద పర్యవేక్షణలో ఆమెకు సురక్షితంగా ఆపరేషన్ జరిగింది. తల్లి బిడ్డ క్షేమంగా ఆసుపత్రి నుంచి గురువారం డిశ్చార్జి కావడంతో తహసీల్దార్ సంతోషం వ్యక్తం చేశారు. మహిళ భర్త మహేష్‌తో కలిసి డాక్టర్ శారదకు తహసీల్దార్ కృతజ్ఞతలు తెలిపారు. తహసీల్దార్ చొరవను డాక్టర్ శారద అభినందించారు. - తెనాలిరూరల్

# నీటి పన్నులు సకాలంలో వసూలు చేయండి

**తెనాలిఅర్బన్:** పట్టణంలోని నీటి పన్నులను సకాలంలో వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా షెడ్డులో సచివాలయ, రెవెన్యూ ఉద్యోగులతో గురువారం సమావేశం నిర్వహించారు. నీటి పన్నులు వసూలు పూర్తిస్థాయిలో జరగడం లేదని తెలిపారు. వసూలును వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారి రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# సోనియా, రాహుల్‌పై ఈడీ కేసులు దుర్మార్గమైన చర్య

**తెనాలిటౌన్:** నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఈడీ చార్జ్‌షీట్ వేయడం దుర్మార్గమైన చర్యని కాంగ్రెస్‌పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ చందు సాంబశివుడు ఆరోపించారు. గురువారం స్థానిక మారీసు పేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బీజేపీ ప్రభుత్వం మండిపడ్డారు. చీరాలను అప్పనంగా బదలాయించుకున్నారని, రూ.988 కోట్లు మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారని బీజేపీ ప్రభుత్వం ఆరోపించడాన్ని తప్పుబట్టారు.